ఆంధ్రప్రభ , పుట : 20-22, జి. రామలక్ష్మి- హైదరాబాదు

## నీతి నిజాయితి

ఒక ఊళ్ళో ఒక జమిందారు ఉండేవాడు. ఆయన చాలా మంచివాడు. 'ధానధర్మాలలో ఆయనకు ఆయనే సాటి' అనీ పేరు పొందాడు. ఆయనకు ఆవులను పెంచడమంటే మహా సరదా. ఆయన పశువుల కొట్టంలో ముప్పయి ఆవులు ఉన్నాయి. అయినప్పటికీ, తనకు నచ్చిన ఆవులను యింకా కొంటూనే ఉండేవాడు.

ఒక రోజు పనిమీద పొరుగూరు వెళ్ళాడు. అక్కడ ఒక గొల్లవాడు పది మంచి మంచి పాడి ఆవులను మేపటానికి తోలుకొని పోతున్నాడు. అందులో ఒక మంచి తెల్ల ఆవు ఉంది. దానిని చూడంగానే, జమీందారుకు, కొనాలని బుద్ధి పుట్టింది. వెంటనే ఆ ఆవుకు తగిన ఖరుదు ఆ గొల్లవానికి చెల్లించీ, తన యింటి గుర్తులు చెప్పి ఆ ఆవును, తన యింటివద్దకు తోలిపెట్టమని చెప్పి ఊరు వచ్చేసాడు.

మరునాడు ఆ గొల్లవాడు, రంగన్న అనే బీద కుర్రవానిని పిలిచి, ''ఈ ఆవును ఫలానా జమీందారుగారి, పశువుల కొట్టానికి  చేర్చిరా'' అని, ఆ జమిందారి యింటి గుర్తులు చెప్పి, ఆ ఆవును వాడితో కూడా పంపాడు. పాపం ఆ కుర్రవాడు చిన్నవాడు, ఆవు, తిన్నగా వాడు చెప్పినట్లు వినకా, తిప్పలు పెట్టడం మొదలు పెట్టింది. ఎలాగో కష్టపడి, దానితో కూడా అవస్తలు పడుతూ, జమిందారు ఊరి పొలిమేర వరకూ తీసుకువచ్చాడు. కానీ, ఊరునీ, అక్కడ ఉండే ఎక్కువమంది జనాన్నీ చూడంగానే ఆవు బెదిరిపోయింది. రంగన్న తాడును ఎంత లాగిపట్టుకున్నా, ఆగకుండా గింజుకోసాగింది.

పాపం రంగన్నకి ఏం చెయ్యాలో తోచిందికాదు. పోనీ ఎవరినైనా తెలుసున్న వాళ్ళని సహాయం అడుగుదామన్నా, తనకు తెలుసున్న వాళ్ళెవరూ కనిపించలేదు. ఆవు వెనక్కి పోవటానికి గింజుకుంటోంది. ఏం చెయ్యాలో బోధపడక, రంగన్న, ఆ ప్రక్కగా పోతున్న పోతున్న పెద్దమనిషిని పిలిచాడు. ''అయ్యా, ఈ ఆవు నాకు లొంగటంలేదు. యిది యీ వూరి జమిందారుగారు కొన్నారు. వాళ్ళ యింటికి వెళ్ళి, దీనిని జమిందారుగారి పశువుల కొట్టానికి చేర్చి రమ్మని మా యజమాని పంపాడు. ఎలాగో కష్టపడి, యిక్కడి వరకూ, తీసుకురాగలిగాను. దయవుంచి నాకు కాస్త సహాయంచేస్తే, ఆయన నాకు యిచ్చే కూలిలో మీకూ సగము యిస్తాను. కాదనకండి. ఇప్పటికే బాగా ఆలస్యమయిపోయింది. జమిందారుగారు, ఈ ఆవుకోసం ఎదురు చూస్తుంటారు.'' అని బ్రతిమిలాడాడు.

ఆ పెద్దమనిషి ఎవరో కాదు. ఆ ఆవును కొన్న జమిందారే. ఆవును యింకా తీసుకు రాకపోతే, ఒకవేళ యిల్లు తెలీలేదేమోననీ ఆవు రాకకై ఎదురు చూస్తూ, ఊరి పొలిమేరవరకూ వచ్చాడు. అంతకు ముందెప్పుడూ రంగన్న, జమిందారుని చూడలేదు. అందువలన ఆవును కొన్న యజమాని ఆయనేనని, తెలుసుకోలేకపోయాడు.

రంగన్న అవస్థలు చూసేసరికి, జమిందారుకి, జాలేసింది. వెంటనే రంగన్నకు సహాయం చేసి, ఆవును జమిందారు పశువుల కొట్టానికి చేర్చాడు.

తర్వాత రంగన్నకు తెలియకుండా, జమిందారు దొడ్డిగుమ్మాన లోపలికి వెళ్ళి తన నౌకరు ద్వారా, ఐదు బంగారు నాణెములను రంగన్నకి యిచ్చి రమ్మని పంపాడు.

ఆ నౌకరు ఒట్టి మోసగాడు. పచ్చిదొంగ ''యింతోటి ఆవును తోలుకొచ్చినందుకు ఐదు బంగారు నాణాలు యివ్వాలా? తను ఏవి యిచ్చినా మళ్ళీ, జమిందారు ఆ కుర్రవాడిని అడగబోతాడా? అయినా యిలాంటి మోసాలు ఎన్నిసార్లు చెయ్యలేదూ!'' అని అనుకుని, బంగారు నాణేలు తను దాచుకుని, ఐదు వెండి నాణాలను రంగన్నకి యిచ్చి పంపేసాడు.

ఈ లోపల జమిందారు, ఏమీ తెలియని వానిలాగ, ఊరి పొలిమేరకు వెళ్ళి, రంగన్న కొరకు ఎదురుచూస్తూ, నిలబడ్డాడు. ఐదు వెండి నాణాలను పట్టుకుని రంగన్న జమిందారు వద్దకు వచ్చాడు. అయ్యా మీ మేలు నేను జన్మలో మరువలేను. యిదిగో ఐదు వెండి నాణాలు నాకు కూలిగా ముట్టాయి. యివిగో, మీకు మూడు నాణాలు, నాకు రెండు నాణాలు, తీసుకోండి'' అన్నాడు మూడు వెండినాణాలను జమిందారు చేతిలో పెడుతూ.

ఆ వెండి నాణాలను చూసేసరికి జమిందారుకి ఆశ్చర్యమేసింది. తను యిచ్చింది బంగారు నాణేలు. రంగన్న దగ్గర ఉన్నవి వెండి నాణేలు, యిదంతా నౌకరు చేసిన మోసమే అయివుంటుంది అనీ మనసులో అనుకునీ, ''అదేమిటిరా నాకు. మూడు నాణేలు యిస్తున్నావు?'' అన్నాడు ఆశ్చర్యంగా, ''అవును, న్యాయం ప్రకారం మీకు మూడు నాణాలు రావాలి'' అన్నాడు.

''అదెలాగురా?'' అన్నాడు ఆశ్చర్యంగా.

‘‘ఆవును, మీ సహాయమే లేకుండే ఆ ఆవు జమిందారుగారి యింటి వరకూ వచ్చేదికాదు. తిరిగి, తాడు లాక్కుని వెనక్కి వెళ్ళిపోయేది. అలాంటి సమయంలో, మీరు నాకు సహాయం చెయ్యకుంటే, నాగతి ఏమయి ఉండేది? అందుకనీ, మీకు మూడు నాణాలు, నాకు రెండు నాణేలు వస్తాయి’’ అన్నాడు.

జమిందారుకు, రంగన్నకి ఉన్న నీతినిజాయితీని చూస్తే, జాలీ ప్రేమా కలిగాయి. రంగన్నని వెంటబెట్టుకుని, తన యింటికి వెళ్ళాడు. నౌకరుని పిలిచి, గద్దించి అడిగేసరికి, వాడు చేసిన మోసం అంతా ఒప్పుకుని, ఐదు బంగారు నాణేలను తీసుకొచ్చి యిచ్చేసాడు.

జమిందారుకు, తన నౌకరుపైన పట్టరాని కోపమూ, రంగన్న నీతి-నిజాయితీపైన అమితమైన ప్రేమ కలిగాయి. వెంటనే ఆ నౌకరును, పనినుండి తొలగించి, భయటికి తరిమేసాడు. రంగన్నను తన ఇంట్లోనే ఉంచుకునీ, మంచిబట్టలు, అవీ కుట్టించి, మంచిగా, చదువూ సంధ్యా చెప్పించాడు జమిందారు.